గల్పిక

# సిరిగలవాడు...

"సిరి గలవానికి చెల్లును
తరుణులు పదియారు వేల తగ పెండ్లాడన్
తిరిపెమున కిద్ద రాండ్రా
పరమేశా, గంగ విడుము పార్వతి చాలున్"

...కవి సార్వభౌముడు శ్రీనాథుడు చెప్పిన ఈ పద్యం శివుని చెవిన పడింది. పెదవి నెలవంకలా దరహసించింది. పలువరస పారిజాతాల వాన కురిసింది. నీలగళంమీద మెరిసిపోతున్న నాగన్న జటాజూటంలో పడగ చేర్చి బుసబుసా నవ్వుకున్నాడు.

కవిసార్వభౌముని గొంత కైలాసగిరిలో డమరుకంలా మార్మోగింది. నందికేశుడుకూడా 'మరోమారు' అన్నట్టు చెవులు రిక్కించాడు. ఇహ వినాయకుని చిందులు సరేసరి.

"విన్నావా, గంగా! పాపం శ్రీనాథుడికి దప్పికగా ఉన్నదట" అన్నాడు కనుబొమలు పైకెత్తిన చూపుతో.

"విన్నాను; కదలనున్నాను...తమ సెలవైతే" అంది గంగ చిరుతరంగాల మృదంగనాదంలా.

"ఇంతకీ అతగాడు పదహారు వేలమంది చేసుకున్న ఆ సిరిపతి గోపికాలోలుణ్ణి తిట్టి, నన్ను మెచ్చుకున్నట్టా? నన్ను తిడుతూ, నందనందనుణ్ణి ఆనందంగా కీర్తించినట్టా?" అమాయకంగా అడిగాడు సర్వజ్ఞుడు.

"మిమ్మల్ని సర్వజ్ఞులని లోగడ పొగిడాడుకదా, ఆమాత్రం తెలుసుకోలేరా?"

"అతని కంత అహంకారం పనికిరాదు."

"పరమశివులు మీరు. మీ పాదధ్యానంతప్ప అన్యమెరుగని భక్తు డతడు. అహంకారం మీ వరప్రసాదమే కావచ్చుగా?"

"తనకూ, విష్ణుమూర్తికీ అభేదం చెప్పుకున్నవాడు నా భక్తు డెలా అవుతాడు?"

"ఈ భేదాభేదాలు నాకు తెలియవు. దప్పికైనవాణ్ణి దయచూడటం నా విధి" అంది గంగ జరీ నురగల అలల పయ్యెద సవరించుకుంటూ.

"మరి నాకుకూడా దప్పికగా ఉందే."

"గరళకంఠుల దప్పిక తీర్చడం నావల్ల కాదు. అమృతాంశు డున్నాడుగా?!" అంది గంగ జడపాయ దాటుతూ.


"మేన సగంబైనదానా! ను వ్వేమంటావ్?" అన్నాడు శంకరుడు కుడికంట వాలుచూపు లగించి.

"చెల్లి చెప్పింది న్యాయమే" అంది పార్వతి ముక్తసరిగా.

"ఇద్దరూ కూడబలుక్కున్నారా?"

"ఈ వెండి కొండమీద మీ పలుకే బంగారం. మూడోకంటికికూడా తెలీకుండా కూడబలుక్కోడం కూడానా?"

"అతడు నన్ను బిచ్చగా డంటుంటే మీకు నవ్వులాటగా ఉన్నట్టుంది." శివుడి కనుబొమ ఫాలానికి చేరి ముడిపడబోయింది.



"చాల్లెండి...అన్నది మన్మథుడు కాదు...మీ కంటిమంటకు మాడి మసికావడానికి. మన్మథుడికి జన్మ నిచ్చిన శ్రీనాథుడు. గంగమ్మ గలగలలతో రాళ్లసీమను రతనాలసీమ చేసి కళ కట్టించా లనుకుంటున్నవాడు. జడపాయల చిక్కు తీస్తాను; చెల్లిని వెళ్లనివ్వండి."

"ఆజ్ఞ!" అన్నాడు శిర సొంచిన శ్రీశైలంమల్లన్న.

ఆ మనోహరదృశ్యాన్ని 'చేనంతా గంగమ్మవాన'గా కీర్తించాడు మరో కవి.

హరవిలాసాన్ని చూసిన శ్రీనాథుడు గలగలలాడుతూ ఉరవళ్లతో ఉరుకుతున్న గంగమ్మని చూసి పరవళ్లు తొక్కాడు.

శ్రీనాథుడు హరు డయ్యాడు.

పురి విప్పిన ఓంకారం 'అఇఉణ్ణు'లు పలికింది.

ఆ తాండవానికి తెలుగునాదం శ్రుతి కలిపింది.

జలదరహితమైన నీలాకాశంనుంచి ఉప్పొంగివస్తున్న గంగను చూసి శ్రీనాథుడు జలదరించాడు. జల ధరించాడు.

తిరిపెముగా కన్నతండ్రి నడిగి,
మురిపెముగా తెచ్చుకున్న నీటిలో నీరై,
ఏటిలో ఏరై, పదములో పదమై,
పద అర్థముల పదను తేరి, ఎవరూ తేరిచూడరానంత
దుర్నిరీక్ష్య తేజంతో తెలుగంత వెలుగుగా, వెలుగంత తెలుగుగా
గీర్వాణంలో మురారిలా
మూడోమార్గంలో పయనించి తెలుగుజాతికి
పరమాప్తు డయ్యాడు...పరమాత్ము డయ్యాడు.

సిరిగలవాడు కాబట్టి చెల్లింది.

ద్వా.నా. శాస్త్రి

(10-01-1985 రాత్రి 11-45కి రాసినట్టు డైరీ సాక్ష్యం)

ఎమ్మీయల్‌గా పేరొందిన ఎమ్.వి.ఎల్. నరసింహారావు నూజివీడు కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా మన్ననలు అందుకొన్నాడు. కవి, నవలారచయిత, మహావక్త అయిన ఎమ్మీయల్ 'ముత్యాలముగ్గు' సినిమా నిర్మాతకూడా. బాపూ-రమణలకు, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యానికి అత్యంత ఆప్తుడు. 'ఎక్కడ ఎమ్మీయల్ ఉండునో, అక్కడ సరసం ఉండును' అన్నంత ఆహ్లాద మాటకారి. హఠాత్తుగా కాలధర్మం చేశాడుగాని, లేకపోతే తన అపూర్వ ప్రతిభతో ఎంత ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించేవాడో....ఆ ఎమ్మీయల్ కలం గళం విప్పితే జాలువారిన రసగుళిక.... ఈ అముద్రిత సాహిత్య గల్పిక!